## ప్రఖ్యాత కథా రచయిత శ్రీ చాసో సమర్పిస్తున్న మినీ కథల పరంపర




"దాసుగారు అంటే.... మీరేనా?" అని అడిగాడు ఒకాయన.

"అవును! కూర్చోండి" అనగానే ముగ్గురు వ్యక్తులు సోఫా మీద కూర్చున్నారు.

"మేము విశాఖపట్నంనుంచివచ్చాము. మీరు కథ బాగా చెబుతారట కదండి!"

"ఇందులో నాదే ముంది. ఆ భక్త మహాశయుల అభిమానం" అన్నాడు గోదావరి నదిలాగా పొంగిపోతూ.

"పెండ్లి సందర్భంగా మీచేత కథ చెప్పించుకోవాలని వచ్చాము" అని విన్నవించుకున్నాడు మరొక వ్యక్తి.

"నేను కథకు వెయ్యి న్నూటపదహార్లు తీసుకుంటానండి ఖర్చులుమీవే" అన్నాడు మొహమాటం లేకుండా.

'అమ్మో' అని అందరూ ఆశ్చర్యపోయారు.

అందులో ఒకడు తేరుకొని "ఆడపెండ్లి తరపు వాళ్ళమండి. అంత భరాయించలేము. అసలే ఖర్చుతో ఉన్నాము", అని ప్రతిమాలాడు.

"బేరాలేమీలేవు సార్. మీకు ఇంకా చాలా తక్కువ. స్టేట్స్‌కు వెళితే రెండు వేలు తీసుకుంటాను.

"మీరు స్టేట్స్ కూడా వెడతారా?" అన్నారు ఆశ్చర్యంగా.

"ఒరిస్సా, బీహారు, బెంగాలు, ఉత్తరాది రాష్ట్రాలు నెలకు సగం రోజులు నాకు బుకింగ్స్ ఉంటాయి. ఇప్పుడు సీజను కదా పక్షనుంచి నెలాఖరుదాకా ప్రోగ్రామ్స్ సెట్ చేశాను. బహుశా ఈ నెలలో మీకు వీలుండకపోవచ్చు." అన్నాడు గర్వంగా హరిదాసు.

"మీరు ఒప్పుకుంటారనే మేము ఇంత దూరం వచ్చాము. కాదనకండి"

"ప్రైము సర్దుబాటు జరుగుతుందిగాని, ఫీజు మాత్రం తగ్గదు."

"మా పొక్కరికి కాస్త తగ్గించండి" అని అడిగాడు మరొకడు.

"ఇలా అందరికీ తగ్గిస్తే నేను బతికినట్టే" అన్నాడు. చుట్టూ బీరువాలు, సోఫాలు చాలా ఖరీదైనవి వున్నాయి. ఒక్కసారి ఇల్లు కలియచూస్తూ.

"అయితే కన్సెషన్ లేదంటారా?" ఆఖరి అస్త్రంగా వేశాడు.

"దైవసన్నిధిలో 'హరికథ' చెప్పేటప్పుడే పైసా తగ్గలేదు." అన్నాడు నవ్వుతూ.

"అయితే వస్తామండీ. పదవ తారీకున రాత్రికి మీరు కథ చెప్పవలసి ఉంటుంది. ఈ శుభలేఖ మీ దగ్గర వుంచుకొని పెండ్లికూడా రండి", అని ముగ్గురూ లేచి వెళ్ళిపోయారు.


శుభలేఖ తీసి చూశారు హరిదాసుగారు. ఈ క్రింద వివరాలు చూసి దిగ్భ్రాంతుడయ్యాడు.

ఆదాయపు పన్నుశాఖ

పేరు : రామకృష్ణ. వృత్తి: హరిదాసు.

నెలసరి ఆదాయం : 20,000.

సంవత్సరమునకు కట్టవలసిన ఆదాయపు పన్ను : 50,000.




— తులసీరాం




ఏం చేస్తున్నావు వదినా?

ఆఁ. ఏం లేదమ్మా - రా. ఏం పొద్దున్నే వచ్చావు? సాధారణంగా పిల్చింది అమ్మ.

ఏమీ లేదమ్మా. కొంచెం కాఫీ పొడి యిప్పిస్తే. సాయంత్రం మా ఆయన ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తెస్తారు. తిరిగిచ్చేస్తాను.

"మా యింట్లోనూ కొంచెమే వుంది. సాయంత్రం యివ్వాలి మరి."

"యిస్తానమ్మా. భలేవారే. ఏంటోగాని పొద్దు పొడవక ముందే మెలకువవస్తుంది. లేవగానే కాఫీ తాగాలి. కాఫీ అయ్యాక ఆ పనీ. ఈ పనీ ఒకటే హడావుడి. పిల్ల

లకు స్నానాలు చేయించి, వాళ్ళను బడికి పంపి, ఆయనకు కావలసినవన్నీ చూసి సాగనంపేసరికి పదవుతుందా. ఇహ నా స్నానం, తర్వాత వంట, వంట దేముంది లెండి. చకచకా చేసేస్తాను. మళ్ళీ మా ఆయన ఒంటిగంటకు ఆఫీసునుంచి వచ్చేలోపల అంతా రెడీ" కీ యిచ్చిన గ్రామఫోను రికార్డులా వాగుకు పోతోంది పొరుగింటి ఇల్లాలు.

"ఔనమ్మా అంతే. కాలం మనకోసం ఆగుతుందా మరి?"

"ఏంటోనమ్మా ఇందిర దేశాన్నే ఏలిందా! మనమేమో ఒక్క ఇంటి బాధ్యతే చూసుకోలేక నానా యాతన పడుతున్నాం. అమెరికా, ఇంగ్లండు దేశాలలో పొద్దున లేచింది మొదలు పరుగులు తీస్తుంటారట. వాళ్ళకేం లేమ్మా. అంతా కరెంటే చేస్తుందటగదా. మనకంత అదృష్టం కూడానా!"

"ఇంద కాఫీపొడి. తీసుకో సాయంత్రం యివ్వాలిసుమా!"

"తప్పకుండానమ్మా. చూశారా అప్పుడే తొమ్మిదయింది. వెళ్ళి కాఫీ పెట్టి ముందు అందరికీ యివ్వందే మొహాలుతేటపడవు. వెళ్ళొస్తానమ్మా. సరేగాని అసలు సంగతి మర్చిపోయాను.

'సీతామాలక్ష్మి' సినిమా చాలా బాగుందట. మ్యాట్నీకి పోదామనుకుంటారా! అయినా మనకా అదృష్టమెక్కడిదిలేమ్మా మన చేతిలో ఏమన్నా రూపాయి పడనిస్తారా? అంతా 'వాళ్ళదే' రాజ్యం. మనకేకోరికా తీరదు" కొంగుతో కళ్ళు తుడుచుకుంది పుల్లమ్మ.

సరే చూద్దాంలే.

అన్నట్టు పక్కింటి సుజాతకు బ్యాంకులో వుద్యోగం వచ్చిందట. అయినా ఆడపిల్లలకు వుద్యోగాలేమిటమ్మా. కాలం మారిపోయిందంటే మారిపోదూ మరి? హాయిగా పెళ్ళిచేసుకొని మొగుడితో కాపురంపెట్టక! పొద్దు మరీ పైకెక్కినట్టుందమ్మా. వస్తాను. అవునమ్మా అబ్బాయికి ఎక్కడన్నా సంబంధాలు చూస్తున్నారా? ఏమైనా వస్తున్నాయా? తొందరగా కోడల్ని తెచ్చుకొని హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చు. ఏ చీకూ చింతా లేకుండా!"

గడియారం తొమ్మిదిన్నర కొట్టింది.

"అమ్మ బాబోయ్. వస్తానమ్మా. మాటల్లో టైము తెలీనేలేదు. మా వారికి ఆఫీసు టైం దాటిపోతున్నది. చిందులేస్తున్నారేమో. పిల్లలూ ఏడుస్తుంటారు. ఎలాగూ టైం అవనే అయింది. ఆ చేత్తో




కొంచెం కరివేపాకు కూడా పెట్టించమ్మా. మార్కెట్టుకు వెళ్ళడానికి యిప్పటికే చాలా టైమయింది." అన్నాది ఆయిల్లాలు.

ఇంక ఉండబట్టలేక "ఈ రోజు ఆదివారము. ఆఫీసులుండవు. మార్కెట్టుకి వెళ్లండి తాపీగా వండండి" అన్నాను.

"ఆఁ ఈ రోజు ఆదివారమాఁ నా మతి మండా" అని నోరుతెరిచింది ఆశ్చర్యంగా ఆ ఇల్లాలు. ★

# మధుర ఘట్టం



ధరణీప్రగడ
(వెంకటశేషగిరిరావు)

మా కాలేజీ ఉదయం మాత్రమే పనిచేస్తోంది. మధ్యాహ్నం ఎవరికో పరీక్షలు జరుగుతుండడంవల్ల మాకు సెలవు.

కాలేజీ ఉదయం ఏడున్నరకు ప్రారంభం అవుతున్నా నేను త్వరగా తయారయి ఏడింటికే కాలేజీ ఆవరణలో ప్రవేశించాను. సూర్యుడి పసిడి కిరణాలు పచ్చికమీద మంచుబిందువులను ముత్యాల్లా ప్రకాశింపజేస్తున్నాయి. మా క్లాసువైపు నడిచాను. మా క్లాసుకి ఇరువైపులా రెండు పసుపు పూల చెట్లున్నాయి. వాటి నుంచి రాలిన పూలు క్రింద పసుపుపచ్చని తివాసీల్లా ఉన్నాయి. అక్కడక్కడ పైకి లేచిన గడ్డిపరకలు ఆ తివాసీల మధ్య ఎంబ్రాయిడరీ డిజైనులా కనిపిస్తోంది. ఆ పచ్చిక పరకల పైనున్న మంచు బిందువులు తివాసీ మధ్య ముత్యాలు పొదిగినట్లున్నాయి.

క్లాసు రూములో అడుగు పెట్టిన నేను అప్రయత్నంగా చివరి బెంచికేసి చూశాను. నల్లని నిగనిగలాడే వెంట్రుకలు, మీనాల్లాంటి కళ్ళు నన్నాకర్షించాయి. నన్ను చూసి ఆ కళ్ళు బెదురుతూ చలించాయి. శరీరం బెదురుతో కంపించింది.

మేమిద్దరం తప్పితే క్లాసులో మరి ఎవ్వరూ లేరు. అప్పటికే పనిమనిషి క్లాసు రూము తుడిచివెళ్ళింది.

మెల్లిగా నా సీటుకేసి నడిచాను. నన్ను చూసి మెల్లిగా లేచి నుంచుంది నేను పుస్తకాలు డస్కులో పడేసి, అలాగే నుంచుని చూశాను. మెల్లిగా బయటికి నడిచింది. జాలిగా చూశాను.

నేను నిన్నేమీ చేయనని చెపుదామనుకున్నాను. నేను చెప్పినా అర్ధం చేసుకునే స్థితిలో లేదని నాకు తెలుసు. అందుకే నేనసలు మాట్లాడలేదు. వెనుకగా బయలుదేరాను. నేను వెనుక రావడం గమనించి చిన్న పరుగులాంటి నడక నడిచి, పసుపు పూల తివాసీలా ఉన్న ఒకచెట్టు క్రిందకి వెళ్ళి నుంచుంది. బెదురుగా నాకేసి చూసింది.

ఆ దృశ్యం నా హృదయాన్ని ఆకట్టింది. చిత్రం గీసుకోవాలనిపించింది. అనేక కోణాలలో ఫొటో తీయాలనిపించింది. కానీ, నేను వచ్చింది కాలేజీకి. ఇక పావుగంటలో క్లాసులు ప్రారంభమవుతాయి. విద్యార్థులు ఒక్కొక్కరే వస్తున్నారు.

నేనుకూడా ఆ చెట్టుకేసి నడిచాను. "నా వెంటపడుతున్నావేమిటీ?" అన్నట్టుగా ఒకసారి నాకేసి చూసింది. మెల్లిగా కదలి కొంతదూరంలోవున్న మామిడి చెట్టు క్రింద ఆగింది. నేను అప్రయత్నంగా ముందుకు నడిచాను. నేనా చెట్టు క్రిందకు చేరేసరికి బెదురుతో చెట్టు ఆవలివైపు వెళ్ళి నిలబడింది. భయంగా చుట్టూ కలయజూసింది. నేను తప్పితే చుట్టుప్రక్కల ఎవరూలేరు. వెనక్కువెళ్ళే అవకాశం లేకుండా వెనక ప్రహరీగోడ ఉంది. ఇక నేటితో తన బ్రతుకు సరి అనుకున్నట్టుగా నా వైపు చూసింది.

నేను క్రిందకున్న మామిడి కొమ్మ విరిచి చేతితో పట్టుకుని మెల్లిగా అటూయిటూ ఊపుతూ చిరునవ్వు నవ్వాను. నేను వేసిన ఆ మంత్రం ఫలించింది. ఆ కళ్ళలో బెదురు తగ్గింది. మెల్లిగా నాకేసి వచ్చింది. దగ్గరగా రాగనే కొమ్మ క్రింద పడవేసి రెండు చేతులతో నడుము పట్టుకున్నాను. తరువాత ఒక చేయి తీసి క్రిందనున్న మామిడి కొమ్మ తీసి నోటి దగ్గర ఉంచి ఒళ్ళు నిమిరాను. మెల్లిగా ఆ కొమ్మనున్న ఆకులు తినడం ప్రారంభించిందా మేకపిల్ల. నా మనసు ఆనందంతో గెంతింది. ఇంతలో బెల్ మ్రోగడంతొ మా క్లాసుకేసి నడిచాను. నాతో కొంతదూరం వచ్చి ఆగిపోయింది. వెనక్కు తిరిగి చూశాను. ఆ కళ్ళలో ధైర్యం కన్పించింది నాకు.

